# గోడమీది రాతలు

శశికళ

సామాను ఎక్కించటం పూర్తయింది. లారీ లోంచి బీరువా, డ్రెస్సింగ్ టేబిల్, సైకిల్, వగైరాలన్నీ తలెత్తి బయటి ప్రపంచాన్ని చూస్తున్నాయి.

రహీం కాలుస్తున్న బీడీని చివరిసారి పీల్చి బయటకు విసిరేస్తూ అడిగాడు. "అంతా అయినట్లేనా సార్?"

"ఆ " అని సమాధానం యిచ్చాను.

లారీ కాబిన్ సీట్లు తుడిచి రహీం, ప్రయాణానికి సిద్ధం చేస్తున్నాడు. వాణి ఇంట్లో పిల్లలకు బూట్లు వేస్తోంది. పిల్లలు ఇద్దరూ కొత్త ఇంటి మీద ఉత్సాహంతో వున్నారు. లేకపోతే యింత తేలికగా ఏ పనీ చేయటం అలవాటు లేదు వాళ్ళకు. మొండితనం, అల్లరి, పెంకెతనం—వీటితో బాటు కొంత గారం, యివన్నీ అయేసరికి వాళ్ళలో కొంచెం మాట వెంటనే వినని తత్వం పెరిగింది. వాణి బి. ఎడ్. పాస యింది. బి. ఎడ్. లో చైల్డ్ సైకాలజీ కూడా ఓ పాఠ్యాంశమే! కానీ వాణికి కొత్తిగా పిల్లల్ని ఎలా పెంచాలో తెలీదు అనుకున్నా.

బూట్లు వేసుకొని సరోజ నా దగ్గిరకొచ్చి అడిగింది—"నాన్నా, లారీ ఎక్కికూర్చోనా?"

"ఎక్కండి" అన్నాను.

సరోజ లారీ ఎక్కబోయింది. మళ్ళీ ఏమనుకొందో ఏమో దిగిపోతూ అంది—"నాన్నా! టెన్ మినిట్స్ నాన్న. మా ఫ్రండ్స్ అందరికి చెప్పి వస్తాం!" నవ్వుతూ "వెళ్ళం"డన్నాను.

సరోజ పరిగెడుతూంటే కూడా ప్రతిమా పరిగెట్టింది. వాణి ఇంట్లోంచి బయటికొచ్చి అడిగింది—"మళ్ళీ పిల్లిద్దరూ ఎక్కడికండీ దారితీశారు?"

"ఫ్రెండ్స్‌కి చెప్పి వస్తామన్నారు!"

వాణి నాలుక కొరుక్కుంది.

"నువ్వూ చెప్పిరా!....పర్వాలేదు. వెళ్ళిపోలేదుగా మనం!" అన్నాడు వాణికి కొంచెం మానసికంగా బలాన్నిస్తూ.


వాణి వెళ్ళింది. రహీం ఇంజన్ బాయెనెట్ తీసి ఏదో చూస్తున్నాడు.

ఇంకా కొన్ని నిమిషాల టైముంది.

ముగ్గురు ఆడవాళ్ళు తలోదారిన స్నేహితుల నుంచి వీడ్కోలు తీసుకునేందుకు వెళ్లారు. అంత త్వరగా వస్తారనే నమ్మకం, ఆశా లేదు.

-ఇంట్లో ఏమీ మర్చిపోలేదుకదా, అనిపించింది. ఊరికే కూర్చోటం దేనికని ఇంట్లోకి నడిచాను.

నిన్నటినుంచీ ఇంట్లోని సామాన్లన్నీ సర్దుతున్నాం. దాదాపు ఎనిమిదేళ్ళనుంచీ ఉంటున్న ఇల్లు ఖాళీ చేయాల్సి వస్తోందంటే బాధగా వుంది. ఇంటివాళ్ళన్న పేరేగానీ సోమయాజులుగారితో ఎప్పుడూ ఏ పేచీ ఉండేదికాదు. ఒకే ఊరిలో ఉంటున్నా ఎప్పుడూ



ఆయన ఇటుకేసి వచ్చిన గుర్తూ లేదు. నెల నెలా బ్యాంక్ ఎకౌంట్‌లో అద్దె ఎంతో అంతా కట్టేస్తే సరి! అక్టోబర్ నెల మొదట్లో మాత్రం ప్రతీ ఏడాదీ వచ్చేవాడు. దగ్గరుండి ఇల్లు అంతా సున్నం కొట్టించేవాడు. "వచ్చేవన్నీ పండుగలు. దసరా, దీపావళీ, నాగులచవితి, సంక్రాంతి, ఉగాది-అందుకే ఇల్లంతా శుభ్రంగా ఉండాలి!" అనేవాడు.

—సోమయాజులుగారు పోయి అపుడే నాలుగేళ్లు కావస్తోంది. ఆయన పోగానే ఇంటి

పెత్తనం రవీంద్రకు వచ్చింది. తండ్రికిపూర్తి విరుద్ధం ఇతను. నాలుగేళ్ళు అయిందేమో, సున్నం కొట్టించి. మొదటి ఏడాది తండ్రి పోయాక ని కొట్టించలేదు. తరువాత ఒకసారి కనపడితే అడిగాను "ఇటికోసారి సున్నం వేయిస్తే....!" అని. రవీంద్ర నవ్వేడు. "వేశ్యకు పెట్టిన డబ్బు, ఇంటికి కొట్టిన సున్నం తిరిగి రావు అని సామెత! అయినా ప్రతి ఏడాదీ దేనికండీ సున్నం?" అన్నాడు తేలికగా.

పండిత పుత్రః పరమ శుంఠః అన్నారు. తండ్రీ కొడుకులు! అయినా ఎంత తేడా

ఏళ్ళ మిదేళ్ళనుంచీ ఉంటున్నాం కనుక అద్దె ఏటంగా వందల్లో పెంచే అవకాశం లేదు. బహుశా అందుకే కాబోలు, ఇల్లు ఖాళీ చేయమంటున్నాడు. కొత్త ఇల్లు వెతికి పట్టుకొనేసరికి రెండు నెలల పైనే పట్టింది. అద్దె వంద పెరుగుతోంది—"ఆ వందా పిల్లకే పారేస్తే సరి. ఇక్కడే ఉండొచ్చు" అంది వాణి. అర్థం లేని మాటలు! "అద్దె పెంచటం కాదు. ఇల్లు ఖాళీ చేయండన్నాడు రవీంద్ర. ఇల్లు వాళ్ళది కనుక, మాటా వాళ్ళదే చెల్లుతుంది!

-చెల్లుతోంది కూడానూ"

-ముందు గదిలో పాతబొత్తు వగైరాలన్నీ చిందరవందరగా ఉన్నాయి. ఇంతకుపూర్వం ఇవన్నీ ఎక్కడ ఉండేవి? ఏమో-టేబిల్ ఉండేది కనుక దానికింద ఉండేవి కాబోలు!! విరిగిపోయిన సామాను గదిలో చిందరవందరగానే ఉన్నాయి. ఆ చెత్తఅంతా తప్పుకొంటూ పక్కనించి కదిలాను.

వెనకగదే మాకు బెడ్‌రూం, లివింగ్‌రూం, డ్రెసింగ్ రూం అన్నీనూ! గదంతా ఇప్పుడు ఖాళీగా ఉంది.

ఆ గది ఇంత పెద్దదని ఇంతక్రితం నాకు తెలీదు. ఒకపక్కన డబుల్ కాట్స్, మరో పక్క బీరువా, బీరువాకు, కాట్స్‌కు మధ్యన డ్రెస్సింగ్ టేబిల్-అన్నీ కిక్కిరిసి ఉండేవి. ఇప్పుడు గదంతా ఖాళీ. డ్రెస్సింగ్ టేబిల్ పక్కనే ఓ కాలెండర్ ఉండేది. ఆ కాలెండర్ ఇప్పుడు నేలమీద ఉంది. కాలండర్ అక్కడ తరచు మారుతూ ఉండేది. ఇంట్లో ఇంకొక చోట ఎక్కడా కనపడని దేస్తు అంతా నాకు అక్కడే కనపడేది. వారం, పదో అయితే పది రోజుల కొకసారి ఓ కాలండర్ వచ్చిపోయేవి.

-కారణం ఇపుడు అర్థం అవుతోంది. ఆ కాలండర్ ఉండే స్థలంనిండా కాటుక మరకలు. అంటే డ్రెస్సింగ్ టేబుల్ముందు కూర్చొని అలంకరణ యజ్ఞంలో నిమగ్నమయి ఉన్నపుడు కంటికొసలకు కాటుక దిద్దాక ఏం చేయాలో తోచక ఆవేలిని కాలండర్ కో, కింద గోడకో రాసేవారన్నమాట!! కాలండర్ కొంచెం పాత బడగానే, నేను కేకలేస్తానని నాకు తెలియకుండా కాలండర్ మార్చేవారన్నమాట!

నవ్వొచ్చింది నాకు

—కానీ గోడంతా నల్లని మరకలు! చూస్తోంటే ఎవరో కొత్తగా పెయింటింగ్ నేర్చుకుంటూ గీసిన గీతల్లా వున్నాయి నల్లని మరకల మధ్య బాలెన్సింగ్ కోసం కాబోలు అక్కడక్కడా ఎర్రని ఆకుపచ్చ, నీలం—రంగు రంగుల చుక్కలూ వున్నాయి. ఇవన్నీ బొట్లు రంగులు కాబోలు!!

—ఇల్లన్నాక ఎంత నీట్‌గా వుండాలి! అయినా యిలా ఎలా చెత్త చేశారు అనుకొన్నాను.

అక్కడ ఒక్క చోటేకాదు, ఇల్లంతా గీతలు, రాతలు ఎన్నో వున్నాయి. ఇంత క్రితం పరిశీలించలేదు కాబట్టి తెలీలేదు. ఇప్పుడు తెలుస్తోంది.

డ్రెస్సింగ్ టేబిల్ పక్కనే, గోడమీద వాణి వేసిన కొలతలు. మూడు అడుగుల నుంచి ఆరున్నర అడుగుల వరకు అంగుళం అంగుళానికి గీతలు. "పిల్లలు పెరుగుతున్నారో లేదో తెలుసుకోవాలంటే యిదే చిట్కా!" అంది వాణి ఆ రోజున. నాకు నవ్వొచ్చింది. "ఏమీ తోచటం

లేదని చెప్పి ఒప్పుకుంటాను. అంతే కానీ ఇలా గోడలంతా గీతలు గీస్తే కానీ పిల్లల పెరుగుదల తెలీదా ఏం!" అన్నాను.

వాణి క్షణం ఊరుకొని అంది—"పోన్లెండి అలాగే అనకోండి! సరేకానీ యిలా రండి, పట, మీకూ నాకూ ఎంత తేడాయో చూద్దాం!"

వెళ్ళాను. పక్కన నిలబడ్డాను. నెత్తిమీద అట్లకాడ పెట్టి గోడ మీదకు గుర్తు పెట్టింది. తర్వాత తను నిలబడింది నేనూ అలాగే గుర్తు పెట్టాను. నా కన్నా వాణి నాలుగు అంగుళాలు చిన్నగా వుంది "నాలుగు అంగుళాలే! అంత పొడదు! ఈ కొలతలు తప్పుగా గీసి పెట్టున్నాను" అంది వాణి తను అంత పొట్టి అని ఒప్పుకోవటానికి యిష్టపడక.

"రా! కావాలంటే పక్కన నిలబడి చూస్కో! నువ్వు ఎలాగైనా పొట్టిదానివే" అన్నాను.

వాణి దగ్గరకు వచ్చి నిలబడింది. పెళ్ళయి ఐదేళ్ళు దాటినా వాణి పక్కన నిలబడితే యింకా గిలిగింతే. "మీ నాన్న నేన పొట్టే...." అంటూ వాణి యింకా ఏదో చెప్తోంది. నేను వినలేదు. ఆ రోజు ఆఫీసుకు నాగా!!

గుర్తొచ్చి నవ్వుకున్నాను.

—డ్రస్సింగ్ టేబిల్ పక్కన పిల్లలు పుస్తకాలు పెట్టుకొనే అలమారు వుంది. ఆ అలమార లోపల ఎన్నెన్నో బొమ్మలు వుండేవి. గోడ మీదంతా పుస్తకాల్లోని రంగు రంగుల బొమ్మలు అంటించి వుంచారు—

—ఆ రోజు నేను ఆఫీస్ నుంచి వచ్చే సరికి పిల్లలు ఇద్దరూ టేబిల్ మీద కూర్చొని గోడమీద కాగితాలు అంటిస్తున్నారు. గమ్ బాటిల్ ఒంపేసి వుంది ఒక పక్కన, మరో పక్కన కత్తెరతో ఇరట్లో వున్న పుస్తకాల్లోని రంగు రంగుల కాగితాలన్నీ జాగ్రత్తగా చింపి పోగులు పెడుతున్నారు. నాకు ఒళ్ళు మండి పోయింది.

—పుస్తకాలు చింపటం ఎంత చెడ్డ అలవాటు! ఇలా పుస్తకాలన్నీ చింపుకొంటే ఎలా? ఎప్పటికి వస్తుంది వీళ్ళకు బుద్ధి? పైగా చింపుతున్న వన్నె రీడర్స్ డైజెస్ట్ పుస్తకాలు! అవంటే ఎంత యిష్టం నాకు!

పట్టరాని కోపం వచ్చింది నాకు. "చేస్తున్న చెత్త పని యిదా చదువూ, సంధ్యా లేకుండా!" అంటూ ఇద్దర్నీ చెరో నాలుగు వడ్డించి కూర్చోపెట్టాను.

బిక్క మొహాలు వేసుకొని సరోజా, ప్రతిమా ఓ మూల కూర్చొని ఏడుస్తున్నారు.

"ఏదీ? ఆ మహారాణి గారు?" అనడిగాను.

"అమ్మ కూరలకు వెళ్ళింది" అన్నారు వాళ్లు.

వాణికి కొంచెం గట్టిగా చెప్పాలనిపించింది, పిల్లలు ఏం చేస్తున్నారో పట్టించుకోకపోతే ఎలాగ అని!

వాణి వస్తోందని ఆ జోళ్ళ చప్పుడుతోనే తెలుస్తోంది. అడుగు నుంచి అడుగు ఎత్తి వేయక నేలకు జోళ్ళను రాస్తూవస్తుంది వాణి. రాగానే విరుచుకుపడ్డాను. "ఏమిటిదంతా?" అని. పిల్లలకు మంచి అలవాట్లు నేర్పకపోతే ఎలా? అని అడిగాను. కొత్తగా యిలా అశ్రద్ధ చేస్తే ఎలా అన్నాను. అన్నీ వింది రాణి. పిల్లలను కొట్టానన్న సంగతి గ్రహించింది ఏమీ అనలేదు వెళ్ళిపోయింది వంటింట్లోకి అన్నం తినేసి, రాత్రి పడుకొన్నాక పక్కకి చేరాక అంది "పిల్లలండీ వాళ్ళు, ఏ అల్లరీ చేయకుండా వుండాలంటే ఎలా? వాళ కూ కొంచెం స్వేచ్ఛ వుండాలా, వద్దా? అది చెయ్యొద్దు ఇది చెయ్యొద్దు అనటమే అయితే ఎలా? ఇంట్లో మిలటరీ క్యాంప్ పెట్టకూడదు. ఏదో చూసీ చూడనట్లు వుండాలి కానీ యిలా వద్దండీ, ఆలోచించండి మీరే!"

—వాణి బి.ఎడ్ చదువు నాకు ఇప్పుడు అర్థమయింది నిజమే, ఇంట్లోవాళ్ళని ఏ పనీ చేయకూడదంటే, తప్పే. గోడమీద రాయ

కూడదు. గోడలమీద కాగితాలు అంటించ రాదు. గోడలకు మేకులు కొట్టకూడదు. అన్నీ కూడదే? మరి ఎలా? ఇంకేం అల్లరిచేయాలి వీళ్ళు? ఆలోచిస్తోంటే తోస్తోంది. ఇంట్లో నేనో పెద్ద సైన్యాధ్యక్షుడిలా ఉంటున్నానని. ఇంట్లోనివాళ్ళంతా సైనికుల్లాగానే ఉంటు న్నారు. ఎటొచ్చీ నేను ఉంటున్నంతసేపూ. నేను ఇంట్లోంచి బయటకు కదలగానే ఇల్లు ఎలా ఉంటుందో నా ఊహకు అందుతూనే ఉంది-నవ్వొచ్చింది.

"సారీ వాణీ-తప్పు నాదే!"

"పోనీండి-ఏదో పిల్లలు-చూసీ చూడనట్లు పోవాలి- అంతేకానీ"అంది వాణి. "పైగా వాళ్లు చింపిన కాగితాలు నేను ఇచ్చినవే. రీడర్స్ డైజస్ట్‌లో అడ్వర్టయిజ్‌మెంట్స్ వున్న పేజీలే తీసి ఇచ్చాను. అవే అంటించు కున్నారు. ఇక గమ్ అంటారా?-ఏదో ఒలికి పోయి ఉంటుంది" అంది వాణి.

పిల్లలకేసి చూశాను. ఇద్దరూ ఒకరిమీద ఒకరు చెయ్యి వేసుకొని పడుకొని ఉన్నారు. నిద్రలో ఎంతటి ప్రశాంతత! నాకు జాలి వేసింది. అనుకోకుండా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

మర్నాడు లేవగానే అన్నాను-"ఇదుగో, మీరు పుస్తకాలు పెట్టుకునే అలమారులో మీ ఇష్టం ఏమైనా చేసుకోండి! అంతేకానీ ఇల్లంతా కాగితాలు అంటించద్దు. సరేనా?" అన్నాను-దానికి పర్యవసానం ఈ రంగు రంగుల కాగితాలు గోడనిండా!

తలుపు వెనక ఏమైనా ఉండిపోయాయేమో అని తలుపు తీసి చూశాను. ఏమీ లేవు. కానీ గోడమీద అన్నీ అక్షరాలే! చిన్నచిన్న అక్షరాల నుంచీ తాటికాయలంత అక్షరాలు 'ఏ' నుంచి 'జడ్' వరకూ. కొన్ని బొమ్మలు, బొమ్మలకింద కాట్, రాట్, డాగ్ అని ఆ బొమ్మల పేర్లు. ఆ పేర్లు లేకపోతే వాటిని గుర్తు పట్టటం కష్టం!-బొమ్మలన్నీ కొంచెం మాసిపోయి ఉన్నాయి.

ఆ సంఘటన గుర్తు వచ్చింది-ఆరోజు రాత్రి నిద్రకు పోయేటప్పుడు తలుపు వేస్తూ ఉలిక్కిపడ్డాను. తెల్లటి గోడంతా ఖరాబయి పోయింది. నిన్నటివరకూ లేని అక్షరాలు గోడలనిండా ఉన్నాయి.

పిల్లలకేసి చూశాను. ఇద్దరూ నిద్రపోతు న్నారు. కోపం కొంచెం తగ్గిందికానీ, వాణిని మాత్రం అడిగాను. "ఏమిటి ఇదంతా?"

"ఎలిమెంటరీ స్కూల్!" అంది వాణి నవ్వుతూ.

"అంటే?"

"అంటేనా-ఈరోజు పిల్లలు ఇంట్లో స్కూలు పెట్టారు ప్రతిమగాడేమో టీచర్ట. చేతిలో బెత్తం పట్టుకొని పిల్లలందరి మీదా ఒకటే అజమాయిషీ. అందర్నీ సరిగ్గా చదవ మంటూ మన ప్రతిమే అక్షరాలు రాసింది గోడమీద!" అంది వాణి.

నాకు చిర్రెత్తుకొచ్చింది. "అంటే అప్పుడు నువ్వు ఇక్కడే ఉన్నావన్నమాట!"

"ఆఁ-చూస్తోంటే ఎంత ముద్దొచ్చిందో చెప్పలేను."

"ఏడవలేకపోయావ్! పిల్లలు అల్లరి చేస్తోంటే ముచ్చట వేసిందిట. చెప్పటానికి సిగ్గు లేకపోతే సరి!"

"పిల్లలు అల్లరి చేయకపోతే నేనుచేస్తానా ఏమిటి?" అంది వాణి.

"చూడు గోడంతా ఎంత ఖరాబయిందో!"

"అవును. అయింది. తలుపు వెనకే కదా రాశారు అని ఊరుకున్నాను."

"ఛీ ఛీ-పిల్లలు ఇల్లు పాడు చేస్తోంటే ఎలా ఊరుకొన్నావ్?"

"దానివల్లకొంపేమీ మునిగిపోలేదుకనుక!"

"కొంప మునిగిపోలేదు. మురికి అయింది కదా!-" అన్నాను తీవ్రంగా. వాణి ఏమీ అనలేదు. తను అనకపోవటంతో ఆ రోజంతా




A quality product of Tungabhadra Industries Ltd. Kurnool.

FEB '81

ఇద్దరమూ ఏమీ మాట్లాడకోలేదు. ఆతర్వాత రోజున ఇంట్లోంచి బయటకొస్తూంటే వాణి నెమ్మదిగా అంది-"పిల్లలకు ఒక బ్లాక్‌బోర్డ్ కొని తెచ్చి ఇంట్లో పడేయండి. వాళ్ళు దాని మీదే రాసుకొంటూ ఉంటారు. అలాగే [illegible] వాడు కూడాను ఇద్దరి చేతులూ కట్టి కూర్చోపెడుతుంటాను. ఇంక ఏ అల్లరీ చెయ్యరు వాళ్ళు!"

ఉలిక్కిపడ్డాను. వాణి చాలా బాధపడిందన్నమాట! ఎందుకిలా? నాకు తెలీకనే నేను ఎందుకిలా అవుతున్నాను? పిల్లల అల్లరిని ఎందుకు అర్థం చేసుకోలేకపోతున్నాను? అనుకున్నాను.

ఆరోజు సాయంత్రం ఇంటికి వెళ్ళేటప్పుడు గుర్తున్నా నేను బ్లాక్‌బోర్డు కొని తీసుకువెళ్ళలేదు.

ఆ సంఘటన నాకు బాధకలిగించింది. ఓ విధంగా కనువిప్పులా అయిందేమో!

బయట నుంచి రహీం హారన్ మోగిస్తున్నాడు. అదే ఆఖరుసారిగా అటూ తిరిగి వచ్చేసిందేమో!

ఇల్లంతా ఆప్యాయంగా యింకోసారి కళ్ళతో తడిమి చూసుకొన్నాను ఒకమూల కాఫీ ఒలికివుంది. ఒకపక్క గోడమీద అంకెలేవో రాసి ఉన్నాయి. మరోపక్క 'ఈ రోజు నుంచీ నిక్కరు వాడుక మొదలు!' అని రాసి ఉంది నిజానికి ఆరోజు నుంచే ప్యాంటువాడుక మొదలు! ఇంకో పక్కగా గోడమీద ఓ చిన్న బొమ్మకోసం కొట్టిన మేకు గుర్తు, ఆ బొమ్మను ఖజురహో వెళ్ళినప్పుడు కొన్నాం!! ప్రతి అంగుళమూ ఏదో కథ చెప్తోంది ప్రతీ గీతా, రాతా ఏదో సంఘటనను గుర్తు చేస్తోంది. కొన్ని గిలిగింతల్నీ. కొన్ని పులకింతల్నీ కలగ చేస్తోంటే, కొన్ని మనసులోని ఏదో తప్పును గుర్తు చేస్తున్నాయి.

ఇన్ని జ్ఞాపకాలను తప్పించుకొని వెళ్ళాలి కాబోలు, అనుకొన్నాను బాధగా

రహీం మళ్ళీ హారన్ మోగించాడు.

కదిలాను. బయటకు వచ్చి తాళంవేసి తాళంచెవి పక్కింటి వాళ్ళకు ఇచ్చాను. వెళ్ళొస్తామని చెప్పి లారీలో ఎక్కాము.

రహీం స్టార్టు చేసి కొత్త ఇంటిదగ్గర ఆపాడు. ముందు దిగి జేబులోంచి తాళం చెవి తీసి ఇంట్లోకి అడుగు పెట్టాను. ఇల్లంతా నిన్న వేసిన సున్నంతో [illegible] గోడలన్నీ నీటుగా ఉన్నాయి.

చిన్న ఈ యింటికి సున్నం వేయిస్తూ ఇంతకుముందు ఉన్నవాళ్ళను ఎన్ని అనుకొన్నానోగదా. ఇల్లంతా ఇంత ఇదిగా ఉంచారేం అనుకొంటూ గోడల నిండా అన్నీ గీతలు, మరకలు, మేకులు కొట్టిన గుర్తులు - ఒళ్ళు మండింది. ఇల్లు నాశనం చేశారని అనుకొన్నాను—కానీ తప్పు!—అలా తప్పుగా అనుకొన్నందుకు బాధపడ్డాను.

మేం ఖాళీ చేసి వచ్చిన ఇంట్లోకి రేపో మాపో కొత్తవాళ్లు వచ్చి దిగుతారు. ఇల్లంతా చెత్తగా ఉందనుకొని సున్నం కొట్టిస్తారు కాబోలు-మా జ్ఞాపకాలు తుడిచేస్తూ!

నాకు బాధ కలిగింది. పిల్లలు కొంచెం పెద్దవాళ్ళయ్యారు ఇప్పుడు ఇంక గోడలమీద రాస్తారో. నాన్న కొడతాడని రాయరో?

పిల్లలు గోడ మీద రాయకపోతే ఇప్పటి ఈ సున్నం గోడలా జీవితమూ వెలవెలపోతుందేమో ఏ జ్ఞాపకాన్నీ ఉంచక! వద్దు. నాకు ఆ శిక్ష వద్దనిపించింది.

వాణి ఇంట్లోకి వస్తూ అడిగింది-"ఏమిటి అలా ఆలోచిస్తున్నారు."

వాణికి నేనేమీ జవాబు ఇవ్వలేదు. నా దృష్టి అంతా ప్రతిమ చేతిలోని పెన్సిల్ మీద ఉంది. లారీలోంచి దిగాక ఎప్పుడు మొదలుపెట్టిందో, గోడమీద అప్పటికే ఇంగ్లీషులో "పి. ఆర్. ఎ" అంటూ రాస్తోంది.

నా దృష్టి గమనించి వాణి ప్రతిమని కేక వేయబోయింది.

నేను వాణిని వారించాను ఊరుకో, పిల్లలే కదా అన్నట్లు!

-జీవితంలో కొత్త ఇల్లు, కొత్త ఆలోచనలకు, కొత్త అనుభూతులకు స్వాగతం చెబుతోంది

-మేం ఇంట్లోకి నడిచాం ✻